పంచిపెట్టారు, అదే వేదం. వేదం మనకు తల్లితో సమానము, అందుచేత వేదమాత అంటారు.

కుతంత్రాల వలన, కుచేష్టల వలన, చిట్కాల వలన, మహిమల వలన ఆత్మజ్ఞానం రాదు. ఆత్మజ్ఞానం వస్తేనేగాని అజ్ఞానం నశించదు, అవిద్య నశించదు, దుఃఖం నశించదు, ఇందులో రాజీపడటానికి అవకాశం లేదు. మీకు సుఖం కావాలా, శాంతి కావాలా, ఈ జననమరణ చక్రం నుండి విడుదలపొందాలని మీకు నిజంగా ఉందా అయితే మీహృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవైకవేద్యం చేసుకోకుండా ఈ చక్రంలో నుండి బయటపడే అవకాశం లేదు. అందుచేత నువ్వు ఏదో మార్గంలో ప్రయాణించి సత్యానుభవం పొందవలసిందే. నీ హృదయంలో ఉన్న సత్యం పరమపవిత్రమైనది. నీ మనస్సు కూడా అంత పవిత్రమైతేగాని అందులో ఐక్యంకాలేదు. మీరు భౌతికంగా బాగా ఉంటే సరిపోదు, స్పిరిట్యువల్‌గా కూడా బాగా ఉండాలి. భక్తులకు విజ్ఞప్తి ఏమిటి అంటే మీరు ఎట్టి పరిస్థితులలోను ఉద్రేకపడవద్దు. వాస్తవపరిస్థితులకు దగ్గరగా ఉండండి, గాలిలో మేడలు కట్టవద్దు. మీరు సంపాదించు కోవలసింది ఏమిటి? వదిలించుకోవలసింది ఏమిటి? ఇది జాగ్రత్తగా చూసుకోండి. మీకు 5 ఎకరాలు ఉంది అనుకోండి 500 ఎకరాలు ఉన్నవాడు ఎలా బ్రతుకుతున్నాడో అలాగ బ్రతకవద్దు. అలా బ్రతకటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే గాలిలో మేడలు కట్టుకోవటం అవుతుంది, ఉన్న 5 ఎకరాలు కూడా ఊడిపోతాయి. సాధారణంగా ధనవంతులు గొప్పలకోసం దానాలు చేస్తారు కాని అవసరం కోసం, ప్రేమకోసం, మంచికోసం దానాలు చేయరు. సామాన్య కుటుంబీకులు ధనవంతులతో స్నేహాలు చేస్తే ఆ ధనం వీళ్ళకు రాదు సరికదా వారి ఖర్చులు వీరికి వస్తాయి, వీరు పాడైపోతారు. అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. మనం ఇతరులను మోసం చేయకపోయిన ఇతరులు చేసే మోసంలో మనం పడకూడదు. అందుచేత లౌకికజ్ఞానం కూడా ఉండాలి. ఆత్మజ్ఞానం లేకపోతే అజ్ఞానం నశించదు. మనకు అదీ అవసరమే, ఇదీ అవసరమే. ఆత్మజ్ఞానానికి దారి చూపించేవాడు పరమాత్మ. పరమాత్మకు మరొకరూపమే భగవద్గీత. పరమాత్మ యొక్క హృదయమే భగవద్గీత, అది మనకు దారి చూపిస్తూ ఉంటుంది. దానిని అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆచరించగలిగితే అది అనుభవంలోనికి వస్తుంది. అది అనుభవైకవేద్యం అయినప్పుడు లోపలఉన్న ఆనందం పొంగి మన సహస్రారాన్ని ముంచుతుంది.

జ్ఞానం మనలను బంధించదు. రూపం మనలను బంధిస్తుంది, నామం బంధిస్తుంది. అందుచేత మనం ఏ పని చేసినా రూపబుద్ధితోటి, నామబుద్ధితోటి చెయ్యకూడదు. రూప బుద్ధితోటి, నామబుద్ధితోటి మనం మంచిపని చేస్తూ ఉంటే మీకు పుణ్యం వస్తే రావచ్చు

కాని జ్ఞానం రాదు, శాంతి రాదు. మనస్సు హృదయంలో ఉంటే రూపబుద్ధి తగ్గుతుంది, నామబుద్ధి తగ్గుతుంది. ఇప్పుడు మన శిరస్సులో మనస్సు ఎంత నార్మల్‌గా, నేచురల్‌గా ఉంటుందో అంత నేచురల్‌గా, నార్మల్‌గా మన మనస్సు హృదయంలో ఉండాలి. మనకు భక్తి ఉంది అనుకోండి అది సహజంగా ఉండాలి. నిజం అనేది సింపుల్‌గా ఉంటుంది, సహజంగా ఉంటుంది. నిజంకానిది అసహజంగా ఉంటుంది, కృత్రిమంగా ఉంటుంది. మనలను ఎవరో బంధిస్తున్నారు, ఎవరో బంధిస్తున్నారు అని అనుకొంటూ ఉంటాము, మన మనస్సే మనలను బంధిస్తోంది అనే బుద్ధి ఇంక మనకు రాలేదు, వాళ్ళనీ, వీళ్ళనీ పట్టుకొని తిడుతూ ఉంటాము, హృదయంలో ఉన్న దేవుడిని వదిలేసి అక్కడా ఇక్కడా తిరుగుతూ ఉంటాము. మనకు గుడిలో ఉన్న దేవుడిమీద ఉన్న నమ్మకం హృదయంలో ఉన్న దేవుడి మీద లేదు. అందుచేత మన మనస్సు లోపలకు వెళ్ళటం లేదు. హృదయంలో అంతర్యామిగా ఉన్న భగవంతుడి మీద మనకు నమ్మకం లేనప్పుడు మన మనస్సు అక్కడకు ఎలా వెళు తుంది, గుళ్ళు చుట్టూ తిరగమంటే తిరుగుతుంది. మనకు రూపబుద్ధి ఉంది కాబట్టి గుళు ళ చుట్టూ తిరగటం అవసరమే, నేను కాదనటం లేదు. మనం భగవంతుడు హృదయంలో లేడు అనుకొంటున్నాము, దేవాలయంలో ఉన్నాడు అనుకొంటున్నాము. కాని భగవంతుడు, మన కంట్రోలర్ మన హృదయంలోనే ఉన్నాడు, ఉండటమే కాదు ఆయన నిశ్శబ్దంగా పని చేస్తున్నాడు, మనలను నియమిస్తున్నాడు. మనకు నిశ్శబ్దం అంటే ఇష్టం ఉండదు, శబ్దం అంటే ఇష్టపడతాము.

కోతులను పట్టుకొనే వారి గురించి ఒక కథ చెపుతారు ఇది భక్తుల గురించి చెప్పారు. కోతులను పట్టుకోవటానికి కోతికి కనపడేలాగ కూజాలో జీడిపప్పో, ఏదో ఒకటి పెడతారు. ఆ కోతి చెయ్యిపెట్టటానికి కూజాకి చిన్న మూతి పెడతాడు. అందులో కోతి చెయ్యి మాత్రమే దూరుతుంది. అలా చిన్న మూతి పెడతారు. కోతి కూజా దగ్గరకు వచ్చి జీడిపప్పును చూసి చెయ్యి లోపలకు పెడుతుంది. చెయ్యి లోపలకు పెట్టిన తరువాత గుప్పిట నిండా జీడిపప్ప తీసుకొని చెయ్యి బయటకు లాగుకోవటానికి ప్రయత్నం చేస్తుంది, గుప్పిట నిండా జీడిపప్ప ఉండటం వలన చెయ్యి బయటకు రాదు. చెయ్యిని ఎవడో పట్టేసుకున్నాడు అనుకొంటుంది. ఆ గుప్పెడు విడిచిపెట్టేసి జీడిపప్ప వదిలేస్తే చెయ్యి బయటకు వచ్చేస్తుంది. తన చేతిలో ఉన్న జీడిపప్పును వదిలేస్తే చెయ్యి బయటకు తీసుకోవచ్చు అనే బుద్ధి దానికి రావటం లేదు. మనం కూడా అంతే. మన మనస్సే మనలను పట్టేసుకుంది. మన మనస్సులో ఉన్న కోరికలు, రాగద్వేషములు మనలను పట్టేసు కొంటున్నాయి. మన మనస్సులో ఉన్న ఆకారములు, వికారములు మనలను పట్టుకొంటున్నాయి అని తెలియక ఎవరో వచ్చి

పట్టేసుకొంటున్నారు అని అనుకొని వాడి నుండి విడిపించుకోవటానికి మరల గుడులు చుట్టూ తిరగటం. ఇదీ మన పరిస్థితి. కోతుల కథ సరిగా మనకు వర్తిస్తుంది. గుప్పెడు వదిలేస్తే చెయ్యి బయటకు వచ్చేస్తుంది అని కోతికి అర్థమవ్వటం లేదు ఎందుచేత జీడిపప్పు మీద ఉన్న ఆశ వలన అది దానికి అర్థమవ్వటంలేదు. అలాగే ఈ లోకం మీద ఉన్న ఆశ వలన, దేహం మీద ఉన్న ఆశ వలన, మమకారం వలన, ఏదో సాధించాలి అనే దురాశ వలన మన మనస్సే మనలను పీడిస్తోంది అనిగాని, మన హృదయంలోనే భగవంతుడు ఉన్నాడు అనిగాని మనకు అర్థం కావటం లేదు. మన హృదయంలో ఉన్న సత్యం మనకు అనుభవంలోనికి వచ్చే వరకు మనం దుఃఖంలోనుండి, కర్మ చక్రంలో నుండి విడుదల పొందలేము. గొప్పల కోసం, గౌరవాల కోసం పనులు చేస్తూ కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. కొంతమంది సాధన చేసుకొంటున్నారా అంటే రేపు అంటారు. రేపు ఎలాగ ఉంటుంది ఏదయినా కొత్తగా ఉంటుందా? ఇవాళ ఎలాగ ఉంటుందో రేపు అలాగే ఉంటుంది. పొట్ట పూజ మటకు ఏరోజుకారోజే. పొట్టపూజ రేపు చూసుకొందాము అని ఎవరూ అనుకోరు, శివపూజ దగ్గరకు వచ్చేటప్పటికి రేపు అంటారు. సాధన దగ్గరకు వచ్చేటప్పటికి రేపు రేపు అంటారు. తిండి దగ్గర మాత్రం ఏ గటంకాగంటే. మీ దగ్గర పది రూపాయలు ఉంటే ఆ పది రూపాయలు ఎలా మేనేజ్ చేసుకోవాలో తెలుసుకొంటున్నారు కాని కాలాన్ని ఎలా మేనేజ్ చేసుకోవాలో తెలుసుకోవటం లేదు. ప్రాణం ఎప్పుడు పోతుందో చెప్పలేము అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి.

మన దుఃఖానికి, అశాంతికి దేహము నేను అనే తలంపే కారణం. భగవంతుడిని విడిచిపెట్టి ఈ సృష్టి లేదు. అసలు ఉన్నది భగవంతుడే. మట్టిలో కుండ ఎలా ఉందో అలాగ భగవంతుడిలో ఈలోకం ఉంది. సముద్రంలో నురుగు, బుడగలు, కెరటాలు ఎలా ఉన్నాయో అలాగ సత్యపదార్థంలో నామరూపాలు ఉన్నాయి. కుండలో నుండి మట్టిని తీసివేస్తే కుండ ఎక్కడ ఉంది. ఈ ప్రపంచంలో నుండి భగవంతుడిని మైనస్ చేస్తే అసలు ప్రపంచం లేదు. మట్టిలో కుండను ఎలా కల్పిస్తున్నామో అలాగ బ్రహ్మంలో ఈ ప్రపంచం కల్పించబడింది అంతే. కుండ లేనప్పుడు మట్టి ఉంది, కుండ ఉన్నప్పుడు ఆ కుండ రూపంలో మట్టి ఉంది, కుండ పతనమయిన తరువాత కూడా మట్టి ఉంటుంది. అలాగే ఈ ప్రపంచం ఉన్నా, లేకపోయినా దీనితో సంబంధం లేకుండా భగవంతుడు ఉన్నాడు, అదే బ్రహ్మం. మనం సమాజానికి ఏమైనా ఉపయోగపడాలి అంటే మనలో కోరికలు తక్కువగా ఉంటే మనం ఇతరుల కోరికలు కొన్ని తీర్చగలము కాని మనకే కోరికలు ఎక్కువగా ఉండి, అవే తీరకపోతే మనం ఇతరులకు ఏమి సహాయం చేయగలము. దీనికి శాస్త్రం అక్కరలేదు. మనకు

కొంచెం బుద్ధి ఉంటే ఇవిఅన్నీ మనకే తెలుస్తాయి. మీరు ఒకవేళ సమాజానికి ఏదైనా సేవ చేసినా డాబుకోసం చెయ్యకండి, ప్రేమతో చెయ్యండి. వాళ్ళ శరీరం కూడా మన శరీరం లాంటిదే. మన శరీరానికి జబ్బు చేస్తే పది రూపాయలు ఖర్చు పెట్టుకొంటున్నాము కదా అలాగే వాళ్ళ శరీరానికి జబ్బు చేసింది కాబట్టి పది రూపాయలు ఖర్చుపెడదాం, వాళ్ళ శరీరం కూడా మన శరీరం లాంటిదే అనుకొని చేస్తే చెయ్యి అంతేగాని డాబు కోసం చేయవద్దు. మనం మాట్లాడేటప్పుడు కూడా అవసరం ఉండి మాట్లాడాలి కాని అహంభావప్రేరితంగా మాట్లాడకూడదు. నీ మనస్సు గొడవ ప్రక్కన పెట్టు, నువ్వు ఉన్నావన్న సంగతి నీకు పెర్‌ఫెక్టుగా తెలుస్తూ ఉండాలి, అది వయ్యా జ్ఞానం, దానిని పొందవయ్యా రామా! ఈ చావుపుట్టుకల గొడవలకేమిఉంది అంటాడు వశిష్ఠుడు.

అమృతత్త్వం అంటే నువ్వు ఎప్పుడూ ఉండాలి కాని మనస్సుకు సంబంధించిన పెంట గొడవ ఏమీ ఉండకూడదు. అమృతత్వం పొందిన వాడికి చావు కూడా ఏమీ అనిపించదు. శరీరానికి మరణం వచ్చింది అనుకోండి ఏదో పోతున్నాము అని వాడు అనుకోడు ఎందుచేతనంటే వాడు పొందవలసింది ఏదో పొంది ఉన్నాడు, అది ఎప్పుడూ ఉంటుంది అని వాడికి తెలుసు. ఉన్నది ఒక్కటే. ఇతరులకు ఏది చేస్తే అదే నీకు తిరిగి వస్తుంది. నీకు మంచి చేస్తే నాకు మంచి వస్తుంది, నీకు చెడ్డ చేస్తే నాకు చెడ్డ వస్తుంది. నేను ఏదిగా ఉన్నానో నువ్వు కూడా అదిగానే ఉన్నావు. మరి నువ్వు నేను వేరుగా ఎందుకు కనిపిస్తున్నాము అంటే మనలో వేరుభావన ఉంది, ఆ బుద్ధి ఎందుకు వచ్చింది అంటే ఇదంతా మనస్సు యొక్క కల్పితం, ఆ పెంటను తీసి ఒక ప్రక్కన పెట్టు. గోవిందుడు ఒక డైనమైట్. డైనమైట్‌తో కొండలను పేలుస్తారు. గోవింద నామం ఏమి చేస్తుంది అంటే మనకు ఆత్మజ్ఞానం రాకుండా మనలో ఏ బలహీనతలు, వాసనలు, అలవాట్లు అయితే అడ్డుగా ఉన్నాయో ఆ బండరాళ్ళను మనం పగలగొట్టలేము, గోవిందనామం డైనమైట్ కింద వాటిని పేల్చి బయట పడేస్తుంది. మనకు దేహమే ఆత్మ అనే బుద్ధి ఉంది. దేహమే ఆత్మ అయితే పరవాలేదు కాని దేహం ఆత్మ కాదు. మీరు దైనందినజీవితంలో చేసుకొనే పూజ, జపం చేసుకోండి కాని ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. సంఘంలో మనకు ఉన్న అనుబంధం విషయంలోకాని, ఇంట్లో మనుషులతో మనకు ఉన్న అనుబంధం విషయంలో కాని, ఏదైనా ఒకమాట మాట్లాడేటప్పుడుగాని, చేతితో ఒక పని చేసేటప్పుడుగాని ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. వీటి అన్నింటి వలన మనకు దేహభావన తగ్గాలి, బ్రహ్మభావన పెరగాలి. దేహభావనలో నుండి విడుదల పొంది బ్రహ్మభావన పొందటమే మన జీవిత గమ్యం. గమ్యం చేరటానికి మీరు చేసే సాధన సహకరించాలి. ఇప్పుడు కొమరగిరిపట్నం నుండి చెన్నపట్నం వెళుతున్నాము

అనుకోండి, ఈ ప్రయాణంలో మనం కార్లు మారతాము, రైళ్ళు మారతాము కాని మన దృష్టి చెన్నపట్నం మీద ఉంటుంది. అలాగే మనం పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా ఏది చేసినా మనం అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి వెళ్ళాలి, చీకటిలోనుండి వెలుతురులోనికి ప్రయాణం చేయాలి. అదే జీవుడి యొక్క గమ్యం. డాబుల కోసం, దర్పాల కోసం మాటలు మాట్లాడే నీకు, పనులు చేసే నీకు ఆత్మజ్ఞానమా అంటున్నాడు పరమాత్మ. ఆయన నిన్ను అనుగ్రహించటానికి నీకు తగిన యోగ్యత ఉందో లేదో తెలియని వాడా గోవిందుడు. నీ హృదయంలో ఏమి ఉందో నీకు తలంపు వచ్చాక తెలుస్తుంది, నీ హృదయంలో ఏముందో నీకు తలంపు రాకుండానే ఆయనకు తెలుస్తుంది, వాడు గోవిందుడు. మిమ్మల్ని, నన్ను, ఈ సృష్టిని అంతా నడిపేవాడు ఆయనే. ఎవడయినా మనకు మంచిచేస్తే వాడు మంచి చేసాడు అనుకొంటున్నాము, వాడెవడు చేయటానికి, వాడి అహంకారం మనకు మంచి చేస్తుందా? వాడి ద్వారా చేయించింది గోవిందుడు, అది మర్చిపోతున్నాము.

ఆత్మజ్ఞానానికి మించిన సిద్ధిలేదు. ఆత్మజ్ఞానం లేకపోతే నీకు శాంతిరాదు. నీకు సిద్ధులు ఉన్నాయి అనుకో, మహిమలు చేసే శక్తి ఉంది అనుకో అయినా ఆత్మజ్ఞానం పొందేవరకు ఏదో వెలితి, ఏదో కొరత నిన్ను వెంటాడుతూనే ఉంటుంది, ఇంకా పొందవలసింది ఏదో ఉంది అని లోపల నుండి గైడెన్స్ వస్తూ ఉంటుంది. సత్యంకాని దానిని సత్యం అని నమ్మేసి అక్కడ చతికిల పడ్డావు అనుకో, లోపల ఈశ్వరుడు ఉన్నాడు కదా, వీడు సత్యం కానిదానిని సత్యం అని నమ్ముతున్నాడు ఇందులోనుండి విడదీసి సత్యం దగ్గరకు తోలుకొని వెళ్ళాలి అని చూస్తాడు, అది చెపితే నీకు అర్థమవ్వటం లేదు అనుకో నీ మనస్సును, బుద్ధిని ఏదో తలుపు సందున పెట్టి నొక్కి విషాన్ని, నీ లోపల ఉన్న మాయను కక్కించి ముందుకు తీసుకొనిపోతాడు, వాడే ఈశ్వరుడు. ఉన్నది ఉన్నట్లుగా నీకు అవగాహన అయ్యేవరకు లేనిదానిని ఉంది అని నువ్వు అనుకొంటూనే ఉంటావు. ఈ చక్రంలో తిరుగుతూనే ఉంటావు. ఏది పొందినా తరువాత ఈ సృష్టి అంతా నీ హృదయంలో లయమయిపోతుందో, ఏది పొందిన తరువాత నీకు బేదబుద్ధి పూర్తిగా నశిస్తుందో అది పొందినప్పుడు నీవు క్షోభలేని స్థితిని పొందుతావు, అప్పటివరకు ఏదో రకమైన క్షోభ నిన్ను వెంటాడుతుంది. రామాయణమే మీకు గైడ్ అని వాల్మీకి చెపుతాడు. రాముడు ఎలా ప్రవర్తించాడు, లక్ష్మణుడు ఎలా ప్రవర్తిం చాడు, సీతమ్మ ఎలా ప్రవర్తించింది అలా ప్రవర్తిస్తూ ఉంటే మీకు జ్ఞానం రాకుండా ఎలా ఉంటుంది. ధర్మాన్ని ఆచరించకుండా మీరు ఎలా పవిత్రులు అవుతారు. పవిత్రుడు కానివాడికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది, ఆత్మజ్ఞానం కలుగకపోతే అశాంతి ఎలా నశిస్తుంది, కర్మచక్రం నుండి ఎలా విడుదలపొందుతావు. నువ్వు

అహంకారంతో పనిచేసినప్పుడు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం ఎత్తుకు ఎత్తు అనుభవించవలసిందే. సముద్రంలోనికి వెళ్ళి నదులు ఎలా ఐక్యమయిపోతున్నాయో అలాగ ఆత్మజ్ఞానసముపార్జనలో కదా ఈకర్మలు, జన్మలు, ఈసృష్టి అంతా నీలో ఐక్యమయ్యేది. అన్నీ ఇవ్వగల దేవుడిని, తనను తాను కూడా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న ఈశ్వరుడిని జ్ఞానం గురించి అడగటం మానివేసి కాల ప్రవాహంలో కొట్టుకొనిపోయే పదార్థములనా మీరు అడిగేది. మీకు దేవుడు కనిపించాడు అనుకోండి జ్ఞానాన్ని ప్రసాదించు అని అడగటం మానివేసి ఇల్లు తుడుచుకోవటానికి చీపురుకట్టలేదు, చీపురుకట్ట ఇవ్వమని అడిగితే ఎలా ఉంటుంది. జ్ఞానం యొక్క విలువ తెలియక మన పరిస్థితి ఇలాగే ఉంది. ఎప్పడయినా మనం శ్రద్ధతో శ్రవణం చేస్తే కదా జ్ఞానం యొక్క విలువ మనకు తెలియటానికి. భగవంతుడి పట్ల నీకు భక్తి ఉంది అనుకో, ఈశ్వరుడిని పొందాలి అని ఆపుకోలేని తపన నీకు వస్తోంది అనుకో సిద్ధులను నీవు కోరుకోనక్కరలేదు, అన్ని సిద్ధులు వచ్చేస్తాయి.

మనం భగవంతుడు కల్పించిన వస్తువులను కోరుకొంటున్నాము కాని భగవంతుడిని కోరుకోవటం లేదు. అదే మీరాభాయి చెపుతుంది. నువ్వు కృష్ణా, గోవిందా అని బజారులో తిరుగుతున్నావు మరి కుటుంబ గౌరవం అంతాపోతోంది అని మీరాభాయితో కుటుంబ సభ్యులు అంటారు అప్పడు మీరాభాయి ఏమని చెప్పింది అంటే ఈ గౌరవాలు, అగౌరవాలు, పుణ్యాలు, పాపాలు, జయాలు, అపజయాలు అన్నీ భగవంతుడు కల్పించినవి, నాకు భగవంతుడు కల్పించినవి అక్కరలేదు, నాకు భగవంతుడే కావాలి అని చెపుతుంది. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే నీవు భగవంతుడే కావాలి అనుకొన్నప్పడు అసలు లోకానికి సంబంధించిన విషయాల మీదకు గాని, సిద్ధుల మీదకు గాని నీ మనస్సు వెళ్ళనే వెళ్ళదు అంటున్నారు. మనం గాఢనిద్రలో మెలకువగా ఉంటాం అనుకోండి, ఆ స్థితి ఎంత వైభవంగా ఉంటుందో చూడండి. గాఢనిద్రలో రూపాలు లేవు, నామాలు లేవు, మనం గ్రహించటానికి అంటూ ఏమీ లేదు కాని గాఢ నిద్రలో మనం ఉన్నాము కదా, ఆ స్థితిలో మనకు మెలకువ వచ్చింది అనుకోండి ఎంత అద్భుతం, ఎంత ఉదాత్తం. దానిని పొందటానికి మనం ప్రయత్నం చేయాలి. దానిని మాటలతో చెప్పలేము, మనస్సు ఊహించలేదు, అది అనుభవైకవేద్యం. కొంతమంది పూజగదిలో కూర్చుని కళ్ళు మూసుకొని లోపల బ్రహ్మం ఉంది అనుకొంటూ ఉంటారు, కళ్ళు తెరచి బయటకు వచ్చిన తరువాత నామ, రూపముల గొడవ అంతా వచ్చేస్తుంది, కంగారు పడిపోతూ ఉంటారు, బయట బ్రహ్మాన్ని చూడలేరు కాని జ్ఞాని కళ్ళు మూస్తే తనను తాను చూసుకొంటాడు, కళ్ళు తెరిస్తే వాడు చూసుకొన్నది మనకు చూపిస్తాడు. లోపల బ్రహ్మం, బయట బ్రహ్మం, పైన బ్రహ్మం, క్రింద బ్రహ్మం, శరీరం ఉంటే బ్రహ్మం, శరీరం

లేకపోతే బ్రహ్మం, నడిస్తే బ్రహ్మం, కూర్చొంటే బ్రహ్మం, అంతా బ్రహ్మమే. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, ద్వితీయం లేనేలేదు. మనం ఇతరుల క్షేమంకోరి పనిచేస్తూ ఉంటే సత్వగుణం పెరుగుతుంది, సత్వగుణం మోక్షానికి దారిచూపిస్తుంది. డాబుకోసం పనిచేస్తే రజోగుణం పెరుగుతుంది. రజోగుణం పాపాన్ని తీసుకొనివస్తుంది.

నువ్వు అజ్ఞానం పెరిగే పనులు చేయకు, అజ్ఞానం పెరిగే మాటలు మాట్లాడకు. మన శరీరం అందంగా ఉండాలని కోరుకొంటున్నాము. ఇక్కడ భగవాన్ మనకు బుద్ధి చెపుతున్నారు. నీ శరీరాన్ని అందంగా అట్టేపెట్టుకోవద్దనటం లేదు మరి నీ మనస్సు ఎంత అందంగా ఉండాలి. నీ శరీరం అందంగా ఉంటే నీకు మోక్షం రాదు, నీ శరీరం అందంగా ఉంటే నీకు ఆత్మజ్ఞానం రాదు. నీ మనస్సు అందంగా ఉంటే నీకు జ్ఞానం వస్తుంది, ముక్తి వస్తుంది. నీ మనస్సును అందంగా చేసుకోవటానికి మరి నీవు ఏమి ప్రయత్నం చేస్తున్నావు. నీ హృదయంలో ఉన్న అద్భుతాన్ని మించిన అద్భుతం అసలు ఈ లోకంలో లేనేలేదు. ఒక్క చైతన్యం తప్పించి మిగతావి అన్నీ దృశ్యములే. నీ మనస్సు ఎంత నిజమో, ఆ మనస్సు చేత చూడబడే విషయాలు కూడా అంతే నిజం. నువ్వు చేయవలసింది విషయచింతన కాదు, నీవు ఆత్మచింతన చేయాలి. ఎవరు చూసినా మేము బిజీగా ఉన్నాము అంటున్నారు, పనీపాట ఏమీ లేనివాడే తీరుబడి లేదని చెబుతూ ఉంటాడు. గాంధీగారు దేశానికి సంబంధించిన పనులు చేస్తూ రోజూ భగవద్గీత అధ్యయనం చేయటం ఎప్పుడూ మానలేదు, రామనామం మానలేదు. మనం గాంధీగారి కంటే పెద్ద పనులు చేస్తున్నామా? ఎవరు చూసినా బిజీగా ఉన్నాము అంటున్నారు, దేనికి బిజీగా ఉన్నారు? అజ్ఞానాన్ని పెంచుకోవటానికి బిజీగా ఉన్నారా? చనిపోయిన తరువాత చీకటి లోకాలకు వెళ్ళటానికి మెట్లు కట్టుకొంటున్నారా? వాడు చేసేది ఏమిటి? వాడు ఇంటికి పనికిరాడు, సమాజానికి పనికిరాడు, బిజీగా ఉన్నాను అంటాడు, పోనీ వాళ్ళు ఏమైనా సాధిస్తున్నారా అంటే అది కూడా ఏమీ కనబడదు, లోపలకు దిగుతున్నారా అంటే అదీ లేదు. వాపును చూసి బలుపు అనుకోవటం, వాపు బలుపు అవ్వదు. జ్ఞానానికి మించినది కాని, జ్ఞానంతో సమానమైనది కాని ఏదీ లేదు. ఒక మనిషికి ఎన్ని మహిమలు చేసే శక్తి ఉన్నా అవన్నీ మనస్సుకు సంబంధించినవే, అది అంతా మనస్సు చేసే గారిడీ, అది అంతా అజ్ఞానానికి సంబంధించినదే. అన్నింటికంటే గొప్పసిద్ధి ఆత్మసిద్ధి. ఏదైతే సత్యమో దానితోటి నువ్వు తాదాత్మ్యం పొందటమే నిజమైనసిద్ధి. ఆ సిద్ధి మటుకే నిన్ను ప్రకృతిగుణాల నుండి విడుదల చేస్తుంది, కర్మచక్రంలో నుండి విడుదల చేస్తుంది, ఆమహాజ్ఞానంలో నీ జన్మలన్నీ సమాప్త మయిపోతాయి.

జూన్ నెలలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచనాలు ప్రారంభమవుతాయి. తేదీలు తరువాత తెలియపర్చబడును.

# దృష్టిచేతనే సృష్టి ఏర్పడుచున్నది

వాసనలతో నిండిన మనస్సుతో ఈ సృష్టిని చూస్తున్నాము కాబట్టి ప్రపంచం కనిపిస్తున్నది, అందుకే ఈ ప్రపంచం అంతా మనస్సుకు చెందినది. మనస్సును అధిగమిస్తే అప్పుడు ఈ ప్రపంచాన్ని చూడటం సాధ్యపడదు. ఒక అడవిలో ముని ఎదురుగా పారిపోయిన లేడి ఆచూకీ అడిగిన బోయవానితో స్వామి ఇలా అంటారు "మా కళ్ళు తెరిచే ఉంటాయి కాని ఏమీ కనిపించవు. సుషుప్తిలోవలె ప్రపంచం అదృశ్యమౌతుంది" అన్న మాటకు "ఇది ఏమి పిచ్చిరా!" అనుకొన్నాడు బోయవాడు. ఇది మనకు అనుభవంలో లేకపోయినా ఆ ముని మాటలో విశ్వాసం ఉంచి మనోనాశనానికి ప్రయత్నించి తీరాలి. ప్రపంచాన్ని చూస్తూ ఉన్నంత సేపు తెలియబడేవి అంతులేకుండా ఉంటూనే ఉంటాయి. అదే బుద్ధిని అంతర్ముఖపరిచి గురుఅనుగ్రహంతో సత్యాన్వేషణ చేస్తే క్రమంగా శాంతిని పొందుతాము. "అణురూపు నిన్ను నే మిన్న రూపం జేరభావోర్ములెపుడాగు అరుణాచలా" అన్నారు భగవాన్. ఈ నిజాన్ని గ్రహించి అంతర్ముఖం కావాలి, అనుకొంటూ వింటూ విన్న దాన్ని ఆచరించలేక, చెవిటివానిలా మందమతిగా జీవిస్తాము. దీనినే దృష్ఠి-సృష్ఠి సంవాదం అంటారు. నా పుత్రులు, నా ధనం, నా దేహం, నా గృహక్షేత్రాదులు అనే ఇంద్రజాల రూపమైన వాసనల వల్లనే మనలను ఎగిరెగిరి పడేటట్లు చేస్తున్నాయి. పరమ సత్యంలో "నేను-నాది" అనునది లేదు. ఆత్మకు అన్యంగా ఏదీ ఎన్నటికీ సత్యం కానేరదు. గుడ్డివాని కెదురుగా అపురూప సుందరి ఉన్నా, ఉండనట్లే. అలాగే మనస్సు లేకున్నా ఈ ప్రకృతి సంపద మనముందు ఉన్నా లేనట్లే. పచ్చి మాంసంతో నిండిన తోలు తిత్తులో దొడ్డవాణ్ణి చూడలేక పోవటమే మాయ, మోసం, దగ. జగత్తును మిధ్యగా చూచేవానికే మాయ దారి ఇస్తుంది. సాధకుడు ఈ నగ్న సత్యాన్ని నిరంతరం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. రాగ ద్వేషాలను నశింపజేసుకొని, పదార్థాన్ని బ్రహ్మ రూపంగా స్ఫురింపజేసుకొనే విశాల బుద్ధిని అలవర్చుకోవాలి. "కత్తి అంచుమీద ప్రయాణం చేసేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో సాధకుడు అంత జాగ్రత్తగా ఉండాలి. ఆత్మ అంతటా సమానంగా ఉంది నీ బుద్ధిని అన్నిటియందు సమాన దృష్టితో అఖండంగా ఉంచు, నీవు సహజ స్థితిలో ఉంటావు" అన్నారు శ్రీ నాన్నగారు. అరిషడ్వర్గాలు అనే ముళ్ళతో నిండిన మన ఆధ్యాత్మిక మార్గాన్ని మన గురువు ముందుండి శుభ్రం చేస్తూ ఉండగా, మనం గమ్యానికి చేరటానికి ఆటంకాలు ఏమి ఉంటాయి. గమ్యాన్ని చేరితే ఈ సృష్టి కనిపించినా, కనబడకపోయినా మన శాంతికి ఏలోటు ఉండదు.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

